నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 24 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

చెన్నూర్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

స్టేషన్ నాదే.. విద్యుత్ నాదే..

రేచినిరోడ్‌లోని రైల్వే స్టేషన్‌లో సొంత కారుకు విద్యుత్ చార్జింగ్ పెట్టుకున్న రైల్వే ఉద్యోగి

తాండూర్, ఏప్రిల్ 23 : రైల్వేస్టేషన్, ఇక్కడ వాడే విద్యుత్ కూడా నాదే అనుకున్నాడో ఏమో ఓ రైల్వే ఉద్యోగి. ఏకంగా తన వాహనాన్ని తీసుకొచ్చి రైల్వేస్టేషన్ ప్రవేశ ద్వారంలోనే చార్జింగ్ పెట్టుకున్నాడు. 'నమస్తే తెలంగాణ' ఫొటోలు తీసేందుకు ప్రయత్నించగా, స్టేషన్ మాదే.. ఈ కరంటు కూడా మాదే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఘటన జరిగింది. అయితే, ఆ ఉద్యోగి తన సమాచారం చెప్పకుండా అక్కడి నుంచి చల్లగా జారుకున్నారు. మరి ఉన్నతాధికారులు ఈ ఘటనపై చర్యలు తీసుకుంటారో? లేదో వేచి చూడాలి మరి?

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి..

బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

చెన్నూర్, ఏప్రిల్ 23 : ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని, తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ప్రజలను కోరారు. చెన్నూర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి మంగళవారం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన రహదారిలో గడప గడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు కీడు చేస్తుందని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం, తెలంగాణ ప్రజల బాగు కోసం నిరంతరం ఆలోచించే కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి తనను భారీ మెజార్టీతో పెద్దపల్లి ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల ప్రచారంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ పాల్గొన్నారు.

చెన్నూర్ నియోజకవర్గంలో అటకెక్కిన అభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 23 : కాంగ్రెస్ పార్టీ నాలుగు నెలల పాలనలో చెన్నూర్ నియోజకవర్గంలో అభివృద్ధి అటకెక్కిందని చెన్నూరు మాజీ శాసనసభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. మంగళవారం క్యాతనపల్లి మున్సిపాలిటీలో తన స్వగృహంలో ఏర్పాటు చేసిన యువజన, విద్యార్థి, సోషల్ మీడియా సమావేశంలో బాల్క సుమన్, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పాల్గొని యువజన, విద్యార్థి, సోషల్ మీడియా వారియర్స్‌కు దిశానిర్దేశం చేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులు అన్ని నిలిచిపోయాయని తెలిపారు. శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, రైతుల సమస్యలు పరిష్కరించలేదని మండిపడ్డారు. మరోసారి పార్లమెంట్ ఎన్నికల పేరుతో రైతులు, ప్రజలను మోసపూరిత హామీలతో నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు కాంగ్రెసు నాయకుల చేతిలో మరోసారి మోసపోవద్దని హితవు పలికారు. మే నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొప్పుల ఈశ్వర్ చెన్నూర్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, క్యాతనపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజా రమేశ్‌బాబు పాల్గొన్నారు.

గుల్లకోట గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కష్టాలే..

మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్షెట్టిపేట, ఏప్రిల్ 23 : వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మళ్లీ మన కష్టాలు రెట్టింపు అవుతాయని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు ప్రజలకు తెలిపాడు. గుల్లకోట, సూరారం, అంకత్‌పల్లి, శాంతాపూర్, పోతపల్లి గ్రామాల్లో ఆయన మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం మొన్న జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి కష్టాలు తెచ్చుకున్నామని పేర్కొనారు. ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో కూడా ఆ పార్టీకి ఓటు వేసి కష్టాలు తెచ్చుకోద్దని, కష్టాలు తీర్చే బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. రైతుల కోసం, ప్రజల సంతోషం కోసం పరితపించిన కేసీఆర్ మళ్లీ మనకు రావాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, సర్పంచ్ శంకరయ్య, రవీందర్, నాయకులు బిల్ల మారుతి ఉన్నారు.

వన్య ప్రాణుల రక్షణను బాధ్యతగా తీసుకోవాలి..

నస్పూర్, ఏప్రిల్ 23 : వన్యప్రాణుల రక్షణను బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత కార్యాలయాల భవనంలో కవ్వాల్ టైగర్ రిజర్వు కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు, ఫీల్డ్ డైరెక్టర్ ఆఫ్ ఫారెస్టు శాంతారామ్, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల అటవీ అధికారులు శివ్ ఆశీష్‌సింగ్, నీరజ్‌కుమార్, ల్యాండ్ స్కేప్ జాతీయ సమన్వకర్త భూమినాథన్, ఏనుగుల ప్రత్యేక కన్జర్వేటర్ నవనీధన్, పశ్చిమబెంగాల్ డబ్ల్యూడబ్ల్యూఫ్ అసిస్టెంట్ మేనేజర్ కుల్‌దీప్‌రాయ్‌లతో కలిసి అధికారులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్య ప్రాణులతో పాటు మానవ జీవితాల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఏనుగుల ఆవాసాలు గుర్తించాలని, ఏనుగులు జనావాసాల్లోకి రాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఏనుగులు అటవీ ప్రాంతాల్లో ఉండే విధంగా తాగునీరు, ఆహారం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, ఇందులో భాగంగా అడవిలో ఆక్రమణకు గురైన అటవీ భూ ప్రాంతాన్ని స్వాధీన పర్చుకుని, వన్యప్రాణులకు ఆహారం అందించే విధంగా పండ్లమొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏనుగులు జనావాసాల్లోకి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల రక్షణలో భాగంగా భద్రత వాహనాలు, డ్రోన్‌లు, నైట్ విజన్ పరికరాల ద్వారా వన్యప్రాణుల కదలికలను గుర్తించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కార్మికుల కష్టాలను గుర్తించింది కేసీఆరే..

- ప్రైవేటీకరణను వ్యతిరేకించింది గులాబీ పార్టీనే..
- అధికారం కోసమే వివేక్ కుటుంబం పాకులాట
- నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమన్నా పెట్టారా?
- ఎన్నికలు రాగానే ఓట్ల కోసం వస్తున్నారు తప్పా ప్రజల కోసం కాదు..
- హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

మందమర్రిలో కేకే 5గని కార్మికులను ఓటు వేయాలని కోరుతున్న కొప్పుల ఈశ్వర్

మందమర్రిలో కేకే5 గని కార్మికులతో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

మందమర్రి, ఏప్రిల్ 23 : సింగరేణి కార్మికుల కష్టాలను గుర్తించింది తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరావు అని ఆ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్‌తో కలిసి మంగళవారం మందమర్రి పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేశారు. మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిని సందర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమాన్ జయంతి సందర్భంగా పాలచెట్టు ఏరియాలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ భక్తులను తనకు ఓటు వేయాలని కోరారు. స్థానిక పాతబస్టాండ్, యాపల్ ఏరియాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివేక్ ఆయన కుటుంబంలో ఇద్దరు ఎమ్మెల్యేలుండగా కొడుకుకు ఎంపీ టికెట్ ఇవ్వడం కాంగ్రెస్‌ది కుటుంబ పాలన కాదా అని ప్రశ్నించారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లుగా వివేక్ పార్టీలు మారుతూ అధికారం కోసం పాకుడుతున్నడని విమర్శించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు 50 ఏండ్లుగా వివేక్ కుటుంబాన్ని ఆదరిస్తే.. ఇతర రాష్ట్రాల్లో పరిశ్రమలు పెట్టి ఆస్తులు పెంచుకున్నారే తప్పా నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమనైనా పెట్టి నిరుద్యోగులకు ఉపాధి కల్పించారా అని ఆయన ప్రశ్నించారు. అబద్ధపు ప్రచారంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలతోపాటు ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలం అయ్యిందని ఆరోపించారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ, మహిళలకు రూ.2,500 పెన్షన్, నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు, రూ.15 వేల రైతుబంధు, రూ.4 వేల ఆసరా పెన్షన్ ఇంకా అమలు కాలేదని భవిష్యత్‌లో కూడా అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి ఓట్లు అడగాలని పేర్కొన్నారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి జవాబు చెప్పాలన్నారు. పదేండ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏం అభివృద్ధి చేసిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం దేవుని పేరు చెప్పి ప్రజలను లూటీ చేస్తున్నారని, తెలంగాణ అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం ఎన్ని నిధులు మంజూరు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

మందమర్రిలో గని కార్మికులతో కరచాలనం చేస్తూ..

మందమర్రిలో పండ్ల బండి వద్ద వృద్ధురాలిని ఓటు వేయాలని కోరుతూ..

కొప్పుల ఈశ్వర్‌నే గెలిపించాలి..

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

ఆస్తులను కాపాడుకునేందుకే వివేక్ కుటుంబం అధికారం కోసం డబ్బు సంచులతో వచ్చారని, ఐదు దశాబ్దాలుగా నియోజకవర్గానికి ఏమి చేయని వారికి ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ప్రజలను కోరారు. శ్రీమంతునికి, బొగ్గు గని కార్మికునికి జరుగుతున్న పోటీలో కార్మికుల కష్టాలను తెలిసిన కొప్పుల ఈశ్వర్‌కు మద్దతు తెలిపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, బీఆర్ఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ రాజరమేశ్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, బడికెల సంపత్, రాజశేఖర్, కొంగల తిరుపతిరెడ్డి, అబ్బాస్, బత్తుల శ్రీనివాస్, ఈశ్వర్, మహేందర్, బర్ల సదానందం, కొండల్‌రావు, వేల్పుల కిరణ్, భట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, రాజ్‌కుమార్, నజీరొద్దీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకే డీసీఎంఎస్ కేంద్రాలు

సెంటర్లలో అవకతవకలు జరిగితే బాధ్యత ఎవరిది

- 3 లక్షల డిపాజిట్ ఉంచుకుని.. పాత ఇన్‌చార్జిలను తొలిగించడం వెనుక మర్మమేంటి?
- జైపూర్‌లో ఒక్కరికే నాలుగైదు కేంద్రాలు.. బినామీ పేర్లతో నడుపుతున్నరు..
- కన్నేపల్లి మండలంలో నాలుగు కేంద్రాలు ఒక్క కుటుంబానికి ఇచ్చిండ్రు
- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనక ప్రైవేటుకు అమ్ముకుంటున్న రైతులు


చెన్నూర్‌లో దుగ్నేపల్లి సెంటర్‌ను విజేందర్‌రెడ్డికి ఇవ్వాలంటూ ఎమ్మెల్యే వివేక్ రాసిన లేఖ..

దుగ్నేపల్లి సెంటర్‌ను సింగిడి విజేందర్‌రెడ్డికి కేటాయించినట్లు జాబితాలో ఉన్న పేరు

మంచిర్యాల, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల డీసీఎంఎస్ ధాన్యం కొనుగోళ్ల సెంటర్ల కేటాయింపుల్లో భారీగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకే ఈ సెంటర్లు ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఎమ్మెల్యే డీసీఎంఎస్ సెంటర్ ఫలానా వ్యక్తికి ఇవ్వండంటూ రికమెండ్ చేసినోళ్లకే సెంటర్ల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. గతేడాది వరకు డీసీఎంఎస్ ఏజెన్సీ ద్వారా సెంటర్ తీసుకోవాలంటే రూ.3 లక్షల డిపాజిట్ కట్టడంతోపాటు ఫర్టిలైజర్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఈ రెండు ఉన్నవాళ్లకే సెంటర్లు ఇచ్చేవారు. కానీ.. ఇప్పుడా నిబంధనలేవి పట్టించుకోకుండా ఎవ్వరికి పడితే వాళ్లకే సెంటర్లు ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతోపాటు జిల్లా స్థాయిలో కొందరు అధికారులు అతి జోక్యంతోనే ఇదంతా జరుగుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పొలిటికల్ ప్రెజర్స్‌తోనే డీసీఎంఎస్ కేంద్రాలు కేటాయిస్తున్నట్లు ఓ అధికారి స్వయంగా చెప్పడం గమనార్హం. సివిల్ సప్లయ్ శాఖలో డీసీఎస్‌వో ఈ కేంద్రాలకు ఇన్‌చార్జిగా ఉండాలి. మంచిర్యాల జిల్లాలో మాత్రం ఆయన సంతకం లేకుండానే ఓ ఉన్నత స్థాయి అధికారి ఫైనల్ చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల లిస్టును ప్రకటించారు. ఆ లిస్టులో 275 సెంటర్లు ఇచ్చినట్లు ఉండగా, డీసీఎంఎస్, పీఏసీఎస్ ఏజెన్సీలు మంచిర్యాల నియోజక వర్గంలో వద్దు అని చెబితే ఈ రెండింటిని మంచిర్యాల నియోజకవర్గంలో తీసేసి వాటి స్థానంలో కొన్ని ఐకేపీ కేంద్రాలు పెట్టి మరికొన్నింటిని బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో పెంచి వాటి సంఖ్యను 262కు ఫైనల్ చేసినట్లు చెప్తున్నారు. మరి 262 సెంటర్ల తుది జాబితానైనా విడుదల చేశారా అంటే అదీ లేదు. ఎందుకంటే డీసీఎస్‌వో ప్రమేయం లేకుండానే ఈ లిస్టు తయారు చేశారని.. అంతా అయిపోయాక ఆయన సంతకం పెట్టడానికి ఇష్టపడలేదని సమాచారం. మెప్మా పీడీ, డీసీవో, డీఆర్‌డీఏ పీడీ, సివిల్ సప్లయ్ డీఎం, డీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్, అదనపు కలెక్టర్ అందరూ సంతాలు పెట్టినప్పటికీ డీసీఎస్‌వో మాత్రం ఇప్పటివరకు సంతకం చేయలేదట. దీనిపై డీసీఎస్‌వోను వివరణ కోరగా జాబితా ఇచ్చేరోజు తాను సెలవులో ఉన్నట్లు చెప్తున్నారు.


కేంద్రాల వివరాల జాబితాలో సంతకం చేయని డీసీఎస్‌వో

మార్చారు సరే.. అవకతవకలు జరిగితే బాధ్యులెవరు..

కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యేలు చెప్పిన వారికో.. టెక్నికల్‌గా చూసుకుంటే డీసీఎంఎస్, పీఏసీఎస్ ఏజెన్సీల బాధ్యులు ఇచ్చిన లిస్టులో ఉన్నవారికో ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. ఈ సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరిగితే ఎవరిది బాధ్యత అనే విషయం స్పష్టత రావాల్సి ఉంది. గతంలో డీసీఎంఎస్ సెంటర్ ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తి రూ.3 లక్షల డిపాజిట్ చేసేవారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఆ డిపాజిట్ డబ్బులతో రైతులకు అన్యాయం జరగకుండా చెల్లింపులు చేసే అవకాశం ఉండేది. కానీ.. ఇప్పుడా పరిస్థితి లేదు. డీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు చేసినోళ్లు సొంత మిల్లులకో లేకపోతే బయటో ఆ ధాన్యాన్ని అమ్ముకుంటే పరిస్థితి ఏంటని పలువురు పశ్నిస్తున్నారు. 3 లక్షల డిపాజిట్ డీసీఎంఎస్ దగ్గరే ఉంచుకుని కొత్తవారికి ఇన్‌చార్జిలు ఇవ్వడం వెనుక మతలబేంటి అనేది అర్థం కావడం లేదు. జైపూర్ మండలంలో ఒకే వ్యక్తి మూడు నుంచి నాలుగు సెంటర్లు అప్పిగించినట్లు తెలుస్తుంది. విషయం బయటికి రాకుండా బినామీల పేర్ల వాటిని నడిపిస్తున్నారు. సదరు వ్యక్తికి ఓ రైస్ మిల్ కూడా ఉంది. కేంద్రాల్లోని ధాన్యాన్ని ఆయన మిల్లుకు తరలించుకొని లబ్ధి పొందడానికే ఇదంతా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక కన్నేపల్లి మండలంలో ఒకే కుటుంబానికి నాలుగు సెంటర్లు ఇచ్చారు. మెట్‌పల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో సెంటర్ నడిచేది. మహిళా సంఘాలు ఆదాయం ఉండేది. దాన్ని మార్చి మరొకరికి ఈ సెంటర్ ఇవ్వడంతో ఆ గ్రామంలోని రైతులు, మహిళ సంఘాల సభ్యులు వచ్చి కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ సెంటర్ల మార్పు మొత్తం జిల్లా స్థాయిలోని ఓ ఉన్నతాధికారి చెప్తేనే జరిగినట్లు తెలుస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు సెంటర్లు ప్రారంభం కాక రైతులు ప్రైవేటు వ్యాపారులకు తమ ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. సెంటర్ల ఇన్‌చార్జిలను మార్చడంతో ఇంకా కొనుగోళ్లు మొదలవలేదని దీంతో రోజుల తరబడి ఎదురు చూసి చివరకు ప్రైవేటోళ్లకు ధాన్యం అమ్ముకున్నామని రైతులు వాపోతున్నారు.

కొనేవాళ్లు లేక బూర్గుపల్లి కొనుగోలు కేంద్రంలో రాశులుగా పోసి ఉన్న ధాన్యం

అనుచరుల కోసం నాయకుల పాకులాట

మంచిర్యాల నియోజకవర్గంలో డీసీఎంఎస్, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలే వద్దని స్థానిక ఎమ్మెల్యే పట్టుపట్టడంతో నియోజకవర్గంలో ఆ రెండు ఏజెన్సీలకు ఒక్క కేంద్రం కూడా ఇవ్వలేదు. మరి అక్కడ ఎమ్మెల్యే వద్దన్న ఆ ఏజెన్సీలను చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు మాత్రం అలాగే కొనసాగిస్తున్నారు. పైగా ఫలానా వ్యక్తికి ఈ కేంద్రాలు ఇవ్వండి అంటూ అధికారులకు లేఖలు రాశారు. అధికారులు సైతం ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకే కేంద్రాలు ఇచ్చారు. గతంలో ఈ తరహాలోనే కేంద్రాలు ఇచ్చినప్పటికీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఎమ్మెల్యే ఎలా రిఫర్ చేస్తారు.. అధికారులు వాళ్లకే ఎలా ఇస్తారు.. అనేది అర్థం కావడం లేదు. ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించినట్లు కాదా అనేది అర్థం కావడం లేదు. కాగా.. ఈ విషయంపై డీసీఎంఎస్ చైర్మన్ లింగయ్యను వివరణ కోరగా.. డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల విషయంలో వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలు అన్నారు. గతంలోనూ ఎమ్మెల్యేలు చెప్పినవాళ్లే ఇచ్చామన్నారు. ఏ కారణంతోనైనా కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలను మార్చొచ్చు, తీసివేయొచ్చన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రెండు కేంద్రాల్లో ఇన్‌చార్జిలను మార్చినట్లు చెప్పారు. కానీ.. చాలా కేంద్రాల్లో ఇన్‌చార్జిలను మార్చినట్లు. కొన్ని కేంద్రాలను మొత్తానికి తీసివేసినట్లు తెలుస్తున్నది.

వడ్లు కొనేటోళ్లు లేక బయట అమ్ముకున్నా

మాది బూర్గుపల్లి గ్రామం. గతంలో మా దగ్గర డీసీఎంఎస్, పీఏసీఎస్, ఐకేపీ మూడు సెంటర్లు ఉండేవి. ఇప్పుడు ఐకేపీది ఒక్కటే పెట్టారు. నేను వడ్లు కేంద్రానికి తెచ్చి 10 రోజులు అయ్యింది. కొనుగోలు కేంద్ర ఇన్‌చార్జిలు ఇప్పటిదాకా ఇటువైపు తొంగికూడా చూడలేదు. నాతో పాటు చాలా మంది రైతులవి నాలుగైదు లారీల వడ్లు ఇప్పుడు కేంద్రంలో ఉన్నయ్. ఎందుకు కొంటలేరో అర్థంకాక ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నా. నా కంటే ముందు నలుగురైదుగురు రైతులు ప్రైవేటుకు అమ్ముకున్నారు. క్వింటాలుకు రూ.1800 నుంచి రూ.2000 మధ్యన ఇస్తున్నరు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర దీనికన్నా ఎక్కువే అయినా.. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటోళ్లకు అమ్ముకున్నా. మా సెంటర్ కాడ ఇప్పటికీ రైతులు ఎదురు చూస్తున్నరు. కొనుగోళ్లు మాత్రం ఇంకా మొదలుకాలేదు.

- భూక్యదేవ్, రైతు

ఎల్ ఈడీ స్క్రీన్ ద్వారా కేసీఆర్ ఇంటర్వ్యూను వీక్షించిన బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్, ఏప్రిల్ 23 : ఒక ప్రైవేటు టీవీ చానల్‌లో తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ లైవ్ ఇంటర్వ్యూ మంగళవారం ప్రసారమైంది. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో మంగళవారం ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్ నాయకులు వీక్షించారు. కేసీఆర్ లైవ్ ఇంటర్వ్యూను వీక్షించటానికి పట్టణంలోని బీఆర్ఎస్ నాయకుడు బెల్లకొండ కరుణాసాగర్‌రావు ఇంటి ఆవరణలో భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా కేసీఆర్ లైవ్ ఇంటర్వ్యూ ప్రచారాన్ని వీరు వీక్షించారు.

ఎల్ ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షిస్తున్న కొప్పుల ఈశ్వర్, బాల్క సుమన్, నాయకులు